క్లుప్తంగా

ఎంపీడీఓకు ఫిర్యాదు



ఫిర్యాదు చేస్తున్న రజకులు

శంకరపట్నం: మండలంలోని కొత్తగట్టు రజక వాడలో అక్రమంగా నిర్మిస్తున్న ప్రహరీని నిలుపుదల చేయాలని సోమవారం ఎంపీడీవో శ్రీవాణికి రజకులు ఫిర్యాదు చేశారు. రజక వాడకు వెళ్లకుండా ప్రహరీ నిర్మిస్తున్న ముత్యాల రాజమ్మ, మల్లయ్యలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. చాకలివాడ నుంచి కొత్తచెరువుకు వెళ్లే దారిలో రోడ్డుపై అక్రమంగా కందకం తీసి గోడ నిర్మిస్తున్నారని ఆరోపించారు. గ్రామానికి చెందిన 60 మంది రజకులు ఎంపీడీఓకు ఫిర్యాదు చేశారు.

ఆర్థిక సాయం అందజేత



పత్రాలు చూపుతున్న చిన్నారులు

మానకొండూర్‌రూరల్: మండలంలోని శ్రీనివాస్‌నగర్ కేజీబీవీలో వంట మనిషిగా పనిచేసిన సరిత ఇటీవల డెంగీతో మృతి చెందింది. మృతురాలికి ఇద్దరు కూతుళ్లు, ఆమె కుటుంబానికి డీఈఓ జనార్దన్, స్పెషల్ ఆఫీసర్ స్వప్న ఆధ్వర్యంలో రూ.2.83 లక్షలు చందా రూపంలో సేకరించి పిల్లల పేరుపై ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. సోమవారం కుటుంబ సభ్యులకు ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండ్లు అందజేసినట్లు స్పెషల్ ఆఫీసర్ స్వప్న తెలిపారు. ఆర్థిక సాయం అందించిన ప్రతి ఒక్కరికి ఆమె ధన్యవాదాలు తెలియజేశారు.

క్రీడాదుస్తుల పంపిణీ



చొప్పదండి: మండలంలోని రెవెల్లి ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు లక్సెట్టిపేటకు చెందిన శివ కుటుంబ సభ్యులు సోమవారం రూ.15 వేల విలువ చేసే క్రీడాదుస్తులు, ఐడీకార్డులు పంపిణీ చేశారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంఈవో వేణుకుమార్ చేతుల మీదుగా విద్యార్థులు దుస్తులు అందుకున్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ముల్కల కుమార్, మాజీ సర్పంచ్ కొత్తూరి లింగమ్మ, ఉపసర్పంచ్ కొత్తకొండ కొమురయ్య, అంజయ్య, బాబు, లావణ్య, తదితరులు పాల్గన్నారు.

డీఎస్పీ కరీంనగర్ జిల్లా కార్యదర్శిగా తాళ్ల నరేష్

మానకొండూర్: చిగురుమామిడి మండలం బొమ్మనపల్లి గ్రామానికి చెందిన తాళ్ల సురేశ్‌ను ధర్మ సమాజ్ పార్టీ (డీఎస్పీ) జిల్లా కార్యదర్శిగా నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహారాజ్ ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవం అనంతరం నియామకపత్రం అందజేశారు. జిల్లా కార్యదర్శిగా నియమించిన పార్టీ రాష్ట్ర అధ్యక్షులకు సురేశ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సురేశ్ నియామకం పట్ల మండల నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.

ఇంటర్నల్ మార్కుల పరిశీలన



రికార్డులను పరిశీలిస్తున్న బృందం సభ్యులు

మానకొండూర్: మండలంలోని చెంజర్ల ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థుల ఇంటర్నల్ మార్కులను మానిటరింగ్ బృందం సోమవారం పరిశీలించింది. పాఠశాలలోని రికార్డులను చూసి అభినందించారు. పదిలో విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించేలా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో టీమ్ లీడర్ వెంకట్రామిరెడ్డి, సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, జయరాజ్, హెచ్‌ఎం, హఫీజ్ ఖురేషి, సమ్మిరెడ్డి, లక్ష్మణ్‌రావు, పద్మజ, వసుమతి, శ్రీలత పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని రాజాపల్లి గ్రామశివారులో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు.. హన్మకొండకు చెందిన ఆర్.కల్పన ఓ ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలో పనిచేస్తోంది. విధుల్లో భాగంగా ద్విచక్ర వాహనంపై జమ్మికుంటకు వచ్చి తిరిగి వెళ్లే క్రమంలో వాహనం అదుపు తప్పి పక్కన బోర్డును ఢీకొట్టింది. ప్రమాదంలో మహిళకు గాయాలుకాగా స్థానికులు 108లో చికిత్స నిమిత్తం హుజూరాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.



హుజూరాబాద్‌లో మార్కండేయస్వామి జయంతి వేడుకలు



జమ్మికుంట: స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

మార్కండేయస్వామి జయంతి

హుజూరాబాద్: పట్టణంలోని అంబేద్కర్‌చౌక్ సమీపంలో శ్రీమహర్షి శివభక్త మార్కండేయ జయంతిని హుజూరాబాద్ మండల పద్మశాలీ సంఘం, టీఆర్‌పీఎస్, చేనేత ఐక్యవేదిక ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మార్కండేయ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ శ్రీనివాస్, తెలంగాణ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర సమాచార కార్యదర్శిభాస్కర్, డివిజన్ అధ్యక్షుడు సాయి, మహిళా విభాగ కార్యదర్శి రాణి, టీఆర్పీఎస్ జిల్లా నాయకులు జిల్లా కోకన్వీనర్ శ్రీనివాస్, మండల అధ్యక్షుడు సత్యనారాయణ, టౌన్ కన్వీనర్ చంద్రశేఖర్, పోతరాజు, సంపత్ ఉన్నారు.

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని కందుగుల గ్రామంలోని శ్రీశివభక్త మార్కండేయ దేవాలయంలో సోమవారం మార్కండేయ జయంతి నిర్వహించారు. ఈసందర్భంగా దేవాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం భక్తులు రథయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ జనార్దన్, వైస్ చైర్మన్ శ్రావన్‌కుమార్ తదితరులు ఉన్నారు.

వైభవంగా శ్రీలక్ష్మిచెన్నకేశవస్వామి కల్యాణం

జమ్మికుంట: మున్సిపల్ పరిధి అబాది జమ్మికుంటలోని శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి దేవాలయం పునర్ నిర్మించి ఏడాది పూర్తయిన సందర్భంగా సోమవారం దేవాలయంలో స్వామివారి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. వేదపండితుల ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణం కన్నుల పండుగగా నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ రాజేశ్వర్‌రావు, కౌన్సిలర్లు శ్రీనివాస్, సుగుణ, నాయకులు వెంకటేశ్, ఆలయ అర్చకులు, దేవాలయం కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

కుక్కలతో బెంబేలు..

- గ్రామసింహాలతో కలవరపడుతున్న ప్రజలు
- రోడ్లపై స్వైర విహారం చేస్తూ హడలెత్తిస్తున్న వైనం
- బయటికి రావడానికి జంకుతున్న చిన్నారులు, వృద్ధులు
- పెద్దపాపయ్యపల్లిలో రెండు రోజుల వ్యవధిలో ఆరుగురికి గాయాలు







హుజూరాబాద్‌రూరల్: గ్రామాలను రక్షిస్తాయనుకుంటున్న గ్రామసింహాలు ప్రజలను భయపెట్టిస్తున్నాయి. దీంతో జనం కలవరపడుతున్నారు. మండలంలో 19 జీపీలు, వాటి అనుబంధ గ్రామాలు కలుపుకొని 23 గ్రామాలు ఉన్నాయి. ప్రతి గ్రామంలో కుక్కల బెడద రోజురోజుకు పెరిగిపోతోంది. దీనికి తోడు కోతుల రచ్చ అంతా ఇంతా కాదు... కుక్కలు, కోతుల దడ నుంచి కాపాడండి మహాప్రభో అంటూ ప్రజలు అధికారులను అర్థిస్తున్నారు.

విచ్చలవిడిగా సంచారం

మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రధాన రహదారులపై, కాలనీల్లో విచ్చలవిడిగా కుక్కలు, కోతులు సంచరిస్తూ ప్రజలను హడలెత్తిస్తున్నాయి. పార్సిల్ కవర్‌తో రోడ్డుపై వెళ్లామంటే ప్రజలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని వెళ్లాల్సిన పరిస్థితి. కోతులు దుకాణాల్లో చొరబడి విధ్వంసం సృష్టిస్తుండటంతో యాజమానులు ఆర్థికంగా నష్టపోతున్నారు. దీనికి తోడు బిల్డింగ్ పైకి వెళ్దామనుకుంటే కోతులు ఇళ్లపై సంచరిస్తుండటంతో భయాందోళనకు గురై కిందికి దిగే క్రమంలో మెట్లపై నుంచి చిన్నారులు, మహిళలు కిందపడి గాయాలపాలవుతున్న ఘటనలు చోటు చేసుకుంటున్నాయి.

జంకుతిన్న చిన్నారులు,వృద్ధులు

పొద్దున స్కూల్, కాలేజికి వెళ్దామంటే బయటికి వచ్చే విద్యార్థులు కోతులు, కుక్కలను చూసి జంకుతున్నారు. వాటిని ఏమనకపోయిన దాడి చేస్తుండటంతో భయందోళనకు గురవుతున్నారు. దీనికి తోడు పొలం, ఇతరత్ర పనులకు వెళ్లే వృద్ధులు, రైతులు, సామాన్యులపై దాడులకు పాల్పడుతుంటంతో ప్రజలు అనారోగ్యబారిన పడుతున్నారు. కుక్కలు, కోతుల నియంత్రణకు అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

రెండు రోజుల్లో ఆరుగురికి గాయాలు

మండలంలోని పెద్దపాపయ్యపల్లి గ్రామంలో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తూ గ్రామస్తులను భయందోళనకు గురి చేస్తున్నాయి. రెండు రోజులుగా కుక్కలు పలువురిపై దాడి చేస్తూ గాయపరుస్తున్నాయి. సోమవారం ఆరుగురు కుక్కల దాడిలో గాయాలపాలయ్యారు. చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు ఆసుపత్రులకు తరలించారు.

భూ కబ్జాపై కలెక్టర్‌కు ఫిర్యాదు



ఫిర్యాదు చేస్తున్న రవిచందర్‌బాబు

జమ్మికుంట: పట్టణంలోని ఆరోవార్డు హౌసింగ్ బోర్డు కాలనీలో మున్సిపల్‌కు చెందిన ప్రభుత్వ భూమిని కబ్జా చేసి గూడెపు వంశీకృష్ణ, గోలాడ సరోజన రహదారి, ఇంటి నిర్మాణాలు చేస్తున్నారని, అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని సోమవారం ప్రజావాణిలో హౌసింగ్‌బోర్డు కాలనీ మాజీ వార్డు సభ్యుడు, బీజేపీ పట్టణ ఉపాధ్యక్షుడు తూడి రవిచందర్‌బాబు ఫిర్యాదు చేశారు. కాలనీలో సొంతస్థలం 60 గజాలు ఉండగా పక్కన ఉన్న ప్రభుత్వ భూమిని ఆక్రమించుకొని ఇంటి నిర్మాణం చేస్తున్నారని, టౌన్ ప్లానింగ్ అధికారి, స్థానిక ప్రజాప్రతినిధి సహాయ సహకారాలు అందజేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. గతనెలలో ప్రజావాణిలో ఫిర్యాదు చేశానని, భూ ఆక్రమణలపై జిల్లా అధికారులతో సమగ్ర విచారణ చేపట్టాలని, లేని పక్షంలో ఆమరణ నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



తిమ్మాపూర్: అభినందిస్తున్న ఎస్‌ఐ చేరాలు



చొప్పదండి: అభినందిస్తున్న సీఐ ప్రకాశ్ గౌడ్



హుజూరాబాద్‌రూరల్: అభినందిస్తున్న ప్రిన్సిపాల్

తిమ్మాపూర్: డ్రాగన్ కుంగ్ ఫు అకాడమీ ఆధ్వర్యంలో కరాటే కరీంనగర్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీలలో రేణికుంట, నేదునూరు గ్రామాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ఇంటర్నేషనల్ షాలిన్ కుంగ్‌ఫూ బ్రూస్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీకి చెందిన విద్యార్థులు పతకాలు సాధించారు. రిషిక (బంగారు), వేదశ్రీ (బంగారు), రేయాన్ (బంగారు), హర్షిత్ (వెండి), మాన్విత్ (కాంస్య) పతకాలు సాధించారని మాస్టర్ తెలిపారు. ఇటీవల రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో పాల్గొని పతకాలు సాధించారని మాస్టర్ ఎలగందుల శ్రీనివాస్ తెలిపారు. రాష్ట్రస్థాయి కరాటే పోటీలలో పతకాలు సాధించిన విద్యార్థులను, కరాటే మాస్టర్ ఎలగందుల శ్రీనివాస్‌ను ఎల్‌ఎండీ ఎస్సై చేరాలు అభినందించారు. పిల్లలకు విద్యతోపాటు కరాటే శిక్షణ కూడా నేర్పించాలి, ఆత్మరక్షణ, ఆపదలో కరాటే ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఇలాంటి విద్యతో ఎన్నో ఉపయోగాలు ఉన్నాయన్నారు.

చొప్పదండి: తెలంగాణ రాష్ట్ర జపాన్ కరాటే అసోషియేషన్ ఇండియా షోటోకాన్ 9వ కరాటే చాంపియన్‌షిప్ 2024 పోటీలు నల్లగొండ జిల్లా కేంద్రంలో నిర్వహించగా చొప్పదండికి చెందిన విద్యార్థులు మూడు బంగారు పతకాలు సాధించారు. ఈ మేరకు చొప్పదండిలో ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థులను చొప్పదండి సీఐ ఆర్ ప్రకాశ్‌గౌడ్, లిటిల్స్ ఐలాండ్ హైస్కూల్ కరస్పాండెంట్ కడారి రవికుమార్, కరాటే మాస్టర్ సుంకె రాజు అభినందించారు. లిటిల్ ఐలాండ్ పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు గోల్డ్, సిల్వర్, బ్రౌంజ్, బ్లాక్ మెడల్స్ సాధించారు. విద్యార్థులు ఆత్మరక్షణ కోసం కరాటే క్రీడల్లో ప్రావీణ్యం పొందాలని సీఐ కోరారు.

రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ అవార్డుకు ఎంపిక

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని తుమ్మనపల్లి గ్రామ శివారులోని ఏకశిల పాఠశాల విద్యార్థి వలబోజు విశ్వనాథన్ ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ ఎగ్జిబిషన్‌లో పాల్గొని అత్యుత్తమ ప్రతిభను కనబరిచాడు. ఈ–ఇన్నోవేటివ్ వెట్ ప్రొటెక్టర్–ఆటోమేటిక్ సీడ్ డ్రయర్ అంశంపై ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి అవార్డుకు ఎంపికయ్యాడు. ప్రాజెక్టును రూపొందించిన విద్యార్థిని, గైడ్ టీచర్ కుమారస్వామిని ఏకశిల విద్యాసంస్థల చైర్మన్ గౌరు తిరుపతిరెడ్డి అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సీహెచ్ దినేశ్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ కిరణ్మయి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమ్మె జయప్రదం చేయండి



నోటీసు ఇస్తున్న వర్కర్స్ యూనియన్ సభ్యులు

ఇల్లందకుంట: దేశవ్యాప్తంగా 16న జరిగే పంచాయతీ ఉద్యోగ, కార్మికుల సమ్మెను జయప్రదం చేయాలని గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొప్పుల శంకర్ పిలుపు నిచ్చారు. సోమవారం ఎంపీవో వెంకటేశ్వర్లకు మండల పరిషత్ కార్యాలయంలో కొత్తూరి మల్లయ్య ఆధ్వర్యంలో సమ్మె నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం 48 చట్టాలను నాలుగు కోడ్‌లుగా విభజించి కార్మిక వర్గానికి తీరని అన్యాయం చేసిందని, కనీస వేతన చట్టాలు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం, కార్మికులు సంఘం పెట్టుకునే, మాట్లాడుకునే హక్కులను నిర్వీర్యం చేసిందన్నారు. కేంద్రం నిర్ణయాలను వ్యతిరేకిస్తూ నిర్వహించే సమ్మెలో ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. యూనియన్ సభ్యులు రవీందర్‌రావు, బాబు, రాజేందర్, అంజయ్య, సంపత్, రవి, రామస్వామి పాల్గొన్నారు.

'కాళేశ్వరం బాధ్యులపై చర్యతీసుకోవాలి'

కరీంనగర్ కార్పొరేషన్: కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో అక్రమాలకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పీసీసీ సీనియర్ అధికార ప్రతిని. ధి కటకం మృత్యుంజయం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. అలాగే ఇప్పటికే వేల కోట్ల రూపాయల ప్రజాధనం నష్టపోయినందున, కాళేశ్వరం ప్రాజెక్ట్ మరమ్మతు పనులు, ఇతర పనులు తక్షణమే నిలిపివేయాలని కోరారు. గత కాంగ్రెస్ ప్రభుత్వహయాంలో తమ్మిడిహట్టి వద్ద చేపట్టిన ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్ట్ పనులను కేసీఆర్ అధికారంలోకి రాగానే నిలిపివేశారని గుర్తు చేశారు. ప్రాణహితను రద్దు చేసి మేడిగడ్డ వద్ద ప్రాజెక్ట్ నిర్మాణం సరైనదేనంటూ తప్పుడు రిపోర్ట్‌లతో జనాలను నమ్మించే ప్రయత్నం చేశారని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ పెద్ద కుంభకోణమని, పాత్రధారులైన కేసీఆర్, హరీశ్‌రావు, ఇంజినీరింగ్ అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

మున్సిపల్ కార్మికుల నిరసన



మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

హుజూరాబాద్: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట సోమవారం మున్సిపల్ కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్మికులు మాట్లాడుతూ... మూడు నెలలుగా వేతనాలు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక, కమిషనర్ సమ్మయ్య వేతనాలు రెండు రోజుల్లో చెల్లించేలా చర్యలు చేపడతామని కార్మికులకు హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు. జీతాలు చెల్లించకపోతే ఆందోళనలు చేపడతామని కార్మికులు హెచ్చరించారు. నిరసనలో అధ్యక్షుడు ఎండీ అజ్జు, ఉపాధ్యక్షుడు సరోజన, సమ్మక్క, క్రాంతికుమార్, మొగిలి, కోశాధికారి రాజేశ్వరి, కార్మికులు పాల్గొన్నారు.

గ్రంథాలయం సద్వినియోగం చేసుకోవాలి



విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేసిన ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ ఫౌండేషన్ చైర్మన్ నక్క శ్రీనివాస్

మానకొండూర్: మండలంలోని చెంజర్ల గ్రామం యాదవ సంఘ భవనంలో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్ ఫౌండేషన్ చైర్మన్ నక్క శ్రీనివాస్ యాదవ్ కోరారు. గ్రామంలోని యాదవ సంఘ భవనంలో నక్క వెంకటమ్మయాదవ్, యాదగిరిస్వామియాదవ్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్ ఫౌండేషన్ సహకారంతో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని సోమవారం ప్రారంభించి మాట్లాడారు. ముందుగా యాదవ సంఘం భవనాన్ని గ్రంథాలయంగా మార్చడానికి అన్నివిధాలుగా కృషి చేసిన యాదవ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. అన్ని పరీక్షల్లో రాణించేందుకు కాంపిటేటీవ్ పరీక్షల బుక్స్ సమకూర్చామని, నిరుద్యోగులు లైబ్రరీ కావాలని అడగ్గానే బుక్స్ సమకూర్చిన ఫౌండేషన్ చైర్మన్ నక్క శ్రీనివాస్‌తో పాటు ఉమేష్‌ను ఎంపీటీసీ గడ్డి రేణుకగణేశ్‌తో పాటు పలువురు అభినందించారు. యాదవ సంఘం భవనంలో ఏర్పాటు చేసిన నా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పట్టణ అధ్యక్షుడు ప్రసాద్, కార్యదర్శులు శ్రీనివాస్, కొమురయ్య,ప్రణయ్, లీగల్ అడ్వైజర్ శ్రీనివాస్, జీఎంపీఎస్ జిల్లా అధ్యక్షుడు మహేశ్, శ్రీనివాస్‌యాదవ్, మాజీ సర్పంచ్ కొండయ్య, ప్రశాంతిమల్లేశ్, ఉప సర్పంచ్ కైలాసం, రాజు, మురళి, మేకల శ్రీనివాస్, బుర్ర శ్రీనివాస్ దుడ్డెల లక్ష్మణ్, సదయ్య, టీచర్లు, విద్యార్థులు, పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుల్లో రాణించాలి



చెక్కు అందిస్తున్న ఫౌండేషన్ నిర్వాహకులు

జమ్మికుంట: విద్యార్థులు చదువుల్లో రాణించాలని పీఎంకే ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పల్లె ప్రభాకర్ గౌడ్ అన్నారు. మండలంలోని కోరపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థుల కోసం బండారి రమ్యను విద్యావలంటీర్‌గా నియమించారు. విద్యా సంవత్సరం పూర్తయ్యే నెలనెలా వేతనం అందిస్తామని సోమవారం పాఠశాల ప్రిన్సిపల్ సమ్మయ్యకు మొదటి నెల జీతం చెక్కును అందించారు. పదోతరగతి విద్యార్థులు పరీక్షల్లో మొదటి ర్యాంకు సాధిస్తే రూ.5,000, రెండో ర్యాంకు సాధిస్తే రూ.2,500 అందిస్తానని ప్రకటించారు. కార్యక్రమంలో పీఎంకే నిర్వాహకులు పల్లె రవిగౌడ్, గండి రంజిత్‌కుమార్ గౌడ్, గిరవేన రాజయ్య, డాక్టర్ గోపి, పల్లె సంపత్ గౌడ్, తాటిగంటి వీరస్వామి, ఉపాధ్యాయులు చైతన్య, దేవదాస్, ప్రకాశ్, శ్రీనివాస్, నరహరి, ప్రేమలత, శ్రీధర్, శ్రీమన్నారాయణ, రజిత తదితరులు పాల్గొన్నారు.

రేపు పుస్తకావిష్కరణ

కరీంనగర్‌కల్చరల్: తెలంగాణ సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో డాక్టర్ గంగ్ర లక్ష్మణరావు కోర్ కమిటీ కన్వీనర్ గాజుల రవీందర్, నంది శ్రీ నివాస్, అన్నవరం దేవేందర్, కేఎస్ అనంతాచార్య సభ్యులుగా పలువురు కవులు, రచయితల సృజనలతో రూపొందించిన 'కరీంనగర్ జిల్లా సమగ్ర స్వరూపం' పుస్తకాన్ని బుధవారం సాయంత్రం 5 గంటలకు ఫిలింభవన్‌లో ఆవిష్కరించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పరిషత్తు అధ్యక్షుడు ఆచార్య శివారెడ్డి అధ్యక్షత జరిగే కార్యక్రమానికి పెద్దపల్లి అడిషనల్ కలెక్టర్ జీవీ శ్యాంప్రసాద్‌లాల్, పరిషత్తు కార్యదర్శి డాక్టర్ చెన్నయ్య పాల్గొంటారని పేర్కొన్నారు.

బడ్జెట్ కేటాయింపులో విద్యారంగంపై చిన్నచూపు

విద్యానగర్(కరీంనగర్): బడ్జెట్ కేటాయింపులో విద్యారంగంపై రాష్ట్ర ప్రభుత్వం చిన్నచూపు చూపిందని ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మల్యాల రాకేశ్ అన్నారు. సోమవారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో విద్యారంగానికి కేవలం 7.75శాతం నిధులే కేటాయించడం శోచనీయమన్నారు. ప్రభుత్వం పునర్ ఆలోచన చేసి విద్యారంగానికి 30శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో మొత్తం బడ్జెట్‌లో విద్యారంగానికి 15శాతం నిధులు కేటాయిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు కంటి తుడుపు చర్యగా నిధులు కేటాయించడాన్ని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే విద్యారంగానికి 30శాతం నిధులు కేటాయించాలని లేని పక్షంలో విద్యార్థుల ఆగ్రహాన్ని చవిచూడాల్సి వస్తుందన్నారు. ఏబీవీపీ జిల్లా కన్వీనర్ విష్ణు, లాఫోరం రాష్ట్ర కోకన్వీనర్ ప్రమోద్‌కుమార్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.